

# కథా కౌముది

## నా పెళ్ళానికి కొమ్ములు వచ్చాయి    పుట్టగంటి గోపీకృష్ణ

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
### సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

చెప్పుకోవాలంటే కొద్దిగా సిగ్గుచేటయిన విషయమే కానీ, చెప్పుకోక తప్పని విషయం.

నా పెళ్లానికి కొమ్ములు వచ్చాయి.

ఇంకా దరిద్రం ఏంటంటే ఆ మాట నాకు తప్ప అందరికీ తెలుసు.

కొంతమంది స్నేహితులయితే 'ఆ విషయం నీకు ఇప్పుడే తెలిసిందా?' అని పగులబడి నవ్వుతున్నారు, అన్యాపదేశంగా ఆ విషయం వారికి ఎప్పుడో తెలుసన్న క్లూ ఇస్తూ.

ఇప్పుడు కాక ఎప్పుడో తెలియటానికి మాదేమన్నా పాతికేళ్ల సంసార బంధమా? మా పెళ్లయి పట్టుమని మూడు రోజులు కూడా కాలేదు. నా పెళ్లి జరిగిన విధానం గురించి అందరు చెవులు కొరుక్కోవటం ఇంకా పూర్తి కూడా కాలేదు. ఇంతలో ఈ సంచలన విషయం తెలిసింది.

నా పెళ్లాం పేరు మాధురి. తను భలే అందంగా ఉంటుంది. మా ఆఫీసులో కొత్తగా చేరింది. చిన్నప్పటి నుండి రొమాంటిక్ సినిమాలు ఇష్టపడే నాకు తను మొదటి చూపులోనే నచ్చింది. పెళ్లి అంటూ చేసుకుంటే మాధురినే చేసుకుందామనుకున్నాను. అందమయిన, పెళ్ళి కాని అమ్మాయిలను త్వరగా సెట్ చేసుకోక పోతే చెయ్యిదాటి పోతారని మిత్రుల ఉవాచ. అందుకే నేను కూడా ఒక మంచి ముహూర్తం చూసుకుని 'నీతో మాట్లాడాలని ఉంది...' అని మాధురిని అడిగాను.

ఒకసారి ఎగాదిగా నా వైపు చూసి, "లవ్ చేస్తున్నావా?" అని అడిగింది.

ఆమె ముక్కుసూటితనాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియక, తలని అష్ట దిక్కులకూ తిప్పాను.

"సరే! సాయంత్రం కలుసుకుందాం. లవ్ చేయాలంటే ముందు ఒకరి గురించి ఒకరం తెలుసుకోవాలి కదా..." అంది తను.

జరిగింది తెలుసుకున్న నా స్నేహితుల మొహాల్లో భావాలు మారిపోయాయి. దానికి కారణం అసూయతో కూడిన ఈర్ష్య అనుకున్నాను. నేను పొరబడ్డానని, అది నా మీద జాలి అని తరువాత తెలిసింది.

ఆ సాయంత్రం ఆఫీసయ్యాక ఇద్దరం కలిసి బయటకు నడిచాం. "కాఫీ షాపుకు వెళ్దామా?" అంటున్న నా మాటను వినిపించుకోకుండా, "ఒక గంట అక్కడ కూర్చుంటే అనవసరంగా వెయ్యి బిల్లు అవుతుంది. మనకది అవసరమా?" అంటూ నడవటం మొదలు పెట్టింది. చేసేదేం లేక ఆమెని అనుసరించాను. అలా కొంత దూరం నడిచి రోడ్డు పక్కన బెంచీ మీద సెటిల్ అయ్యింది. నేను కూడా పక్కన కూర్చున్నాను. ఎదురుగా ఉన్న ఒక పెద్ద బిల్డింగ్ చూపిస్తూ, "నేను ఇంతకుముందు ఇక్కడే పనిచేసేదాన్ని..." అంది.

"ఈ కంపెనీ మన కంపెనీ కంటే మంచి కంపెనీ కదా! మరి ఎందుకు షిఫ్ట్ అయ్యావు..." అడిగాను నేను.

"అక్కడ మేనేజర్ ఒకరోజు నాకు ప్రపోజ్ చేశాడు..."

"అయితే..." అని ఏదో అర్థమయినట్లు, "అతనంటే ఇష్టం లేక, ఆ విషయం అతనికి చెప్పలేక ఉద్యోగం మానివేసావా?" జాలిగా అడిగాను. అందమయిన ఆడవాళ్ళకి పాపం ఇలాంటి కష్టాలు తప్పవు అనుకుంటూ.

"అదేం లేదు. చూడటానికి అతను కూడా బానే ఉంటాడు. నీలానే కాఫీ షాపుకు వెళ్దామన్నాడు. వెళ్లాము. కాఫీ తాగటం పూర్తికాకముందే నా చేతి మీద చెయ్యి వేసి నిమరటం మొదలుపెట్టాడు. అలాంటి పనులు నాకు నచ్చవని చెప్పాను. అయినా వినలేదు. ఎదురుగా కూర్చున్న వాడల్లా లేచి వచ్చి పక్కన కూర్చున్నాడు. ఊరుకున్నాను. నా భుజం మీద చెయ్యి వేసాడు..." అని మాధురి ఏదో చెప్పబోతుంటే ఒక పల్లీలు అమ్ముకునే వాడు వచ్చాడు. తన మాటలు ఆపి వాడి దగ్గర రెండు పొట్లాలు కొని ఒకటి నా చేతిలో పెట్టింది. దూరంగా ఉన్న బండిని చూపించి, "దో అదరక్ చాయ్..." అని పల్లీల వాడికే చెప్పింది. తరువాత నా వైపు చూసి, "ఎంతవరకు చెప్పాను..." అంది.

"నీ భుజం మీద మీ మేనేజర్ చెయ్యి వేసినంత వరకు..."

"అంతే! నాకు కోపం వచ్చింది. భుజం మీద ఉన్న వాడి చేతిని టేబుల్ మీద పెట్టాను. టేబుల్ మీద ఉన్న ఫోర్క్ తీసి ఒక్క పోటు పొడిచాను..."

ఉలిక్కిపడి, "ఎక్కడ?" అని అడిగాను.

"చేతి మీదేలే. దానికే పెద్ద ఇష్యూ చేశాడు. నేను రిజైన్ చేసి వాడి మొహాన కొట్టి మీ ఆఫీసులో చేరాను."

ఆ అమ్మాయి తన గురించి అంత చెప్పినపుడు నేను కూడా నా గురించి చెప్పటం ధర్మం కాబట్టి, "నేను ఈ ఆఫీసులో మూడేళ్ల నుండి ఉన్నాను..." అంటూ ఏదో చెప్పబోయాను.

"నువు కలుసుకుందాం అన్నపుడే నీకు వచ్చే జీతం సహా అన్నీ కనుక్కున్నాను. ఆఫీసు విషయాలు తప్ప వేరే ఏమయినా చెప్పు..." అంది.

"మా అమ్మా, నాన్నలకు నేను ఒకడినే కొడుకును. నా తరువాత ఒక అమ్మాయి ఉంది. ఇంకా చదువుకుంటోంది..."

"నీ బయోగ్రఫీ చెప్పటానికా నన్ను ఇక్కడకు రమ్మంది?"

"సారీ!..." అన్నాను నేను. ఈ అమ్మాయికి ఉపోద్ఘాతాలు నచ్చవని అర్థమయిపోయింది. అందుకే సరాసరి పాయింటుకు వచ్చేస్తూ, "మీరు నాకు మొదటి చూపులోనే నచ్చారు..." అన్నాను.

"నచ్చటం అంటే ఏమిటి? అసలు ఒకళ్లని చూడగానే వాళ్ళ గురించి ఏమీ తెలియకుండా ఎలా నచ్చుతారు?"

మళ్ళీ గుటకలు మింగాను. "అవన్నీ నాకు తెలియదు. మిమ్మల్ని చూడగానే మీరు నాకు భార్య అయితే బాగుండని అనిపించింది."

"నువు నాకు భర్తవి అయితే బాగుండని నాకు కూడా అనిపించాలి కదా?"

ఇంతలో చిన్న కుర్రాడు రెండు గాజు గ్లాసుల్లో చాయ్ పట్టుకుని వచ్చాడు. ఇద్దరం చెరొకటి తీసుకున్నాం. నేను జేబులో చెయ్యి పెడితే వారించింది. ఆ కుర్రాడే తనకి వంద రూపాయలు ఇచ్చాడు. అందులో నుండి రెండు ఇరవై నోట్లు వాడికి వెనక్కి ఇస్తూ, "ఒకటి చాయ్‌కి. రెండోది నీకు..." అంది.

వాడు మాధురికి డబ్బులు ఎందుకు ఇచ్చాడో నాకు అర్థం కాలేదు. ఆ విషయం అడిగితే ఎలా రియాక్ట్ అవుతుందో తెలియదు. అందుకే మధ్యే మార్గంగా, "పాపం! చిన్న కుర్రాడు. ఈ వయసులో బడికి వెళ్లకుండా పని చేస్తున్నాడు. పిటీ..." అన్నాను నేను వెళ్ళిపోతున్న ఆ కుర్రాడి వైపు జాలిగా చూస్తూ.

"సానుభూతి ఎందుకు? వాడి జీవితంలో మార్పు తెచ్చేటందుకు ఏమి చెయ్యాలో ఆలోచించాలి కానీ..." అంది చాయ్ తాగుతూ.

"లేబర్ ఇనస్పెక్టర్‌కి ఫోన్ చేసి చెప్తే సరి. వాడి సేటును అరెస్ట్ చేసి, వీడిని బడికి పంపుతారు..." అన్నాను పరిష్కారం చూపిస్తూ.

"నువు చెప్పినట్లు చేస్తే ఆ ఇనస్పెక్టర్‌కి ఒక వెయ్యి లంచం తప్ప వీళ్లకి వచ్చే లాభం ఏమీ ఉండదు."

"మరి ఏం చెయ్యాలి?" అన్నిటికి అడ్డగోలుగా మాట్లాడుతున్న ఆమెను ఆశ్చర్యంగా చూస్తూ అన్నాను.

"ఇదే ప్రశ్న నాకు నెల క్రితం ఎదురయింది. వాళ్ల సమస్యలకు కారణం కుటుంబ ఆర్థిక సమస్యలు అని అర్థం చేసుకోవటానికి వారం పట్టింది. ఆ కుర్రాడి తండ్రికి పాతిక వేలు ఇచ్చి ఆ వ్యాపారం పెట్టించింది నేనే. ఇప్పుడు కుటుంబమంతా కలిసి పని చేసుకుంటున్నారు. నా డబ్బులు నేను రోజుకు వంద చొప్పున వసూలు చేసుకుంటున్నాను."

"మరి ఆ పిల్లాడి చదువు?"

"ముందు పొట్ట నిండితే తరువాత వాడే చదువుకుంటాడు."

ఆమె వారికి సహాయం చేసింది సరే. ఇలా కాబూలీవాలీ లాగా రోజూ వంద వసూలు చేయటం ఎందుకు? అన్న నా సందేహం అర్థమయింది అనుకుంటా, "ఊరికినే డబ్బు ఇస్తే దాని విలువ ఎవరికీ తెలియదు. పైగా నేను జీవితంలో ఒక్కరికి సాయం చేసి ఆగిపోవాలనుకోవటం లేదు. ఇలా వసూలు చేసిన డబ్బు మరొకరికి ఉపయోగపడుతుంది..." అంది మాధురి.

నాకు ఏమి మాట్లాడాలో తెలియలేదు. మాటలు కూడగట్టుకునే లోపు తను బెంచీ మీద నుండి లేచింది. అప్పుడే మాట్లాడుకోవటం అయిపోయిందా అన్నట్లు అయోమయంగా చూస్తున్న నాతో, "రేపన్నది ఎప్పుడూ ఉంటుంది. అన్నీ ఇవాళే మాట్లాడుకోవాలా?" అంటూ ఆ రోజు సమావేశం ముగించింది.

మరుసటి రోజు కూడా యథాప్రకారం ఆఫీసు నుండి బయటకు నడుచుకుంటూ వచ్చాం. మళ్లీ ఇవాళ కూడా అప్పుల వసూలు యాత్ర తప్పదా అనుకుంటుంటే, నా మీద దయతలచి రూటు మార్చింది. అక్కడ ఒక గుడి ఉంది. దాని ఆవరణలో కింద కర్చీఫు వేసి కూర్చుంది. నన్ను కూడా కూర్చోమంది.

నేను కూడా ఆమె పక్కన కూర్చున్నాను. "ముందు దర్శనం చేసుకుని కదా తరువాత కూర్చుంటారు. నువ్వేంటి ఇప్పుడే కూర్చున్నావ్?" అని అడిగాను.

"నేను దేవుడిని నమ్మను. పూజలు చెయ్యను. కొంపతీసి మనిద్దరికీ పెళ్లయిందనుకో, పెళ్లయ్యాక కూడా పూజలూ, వ్రతాలూ చెయ్యను. కావాలంటే నువు చేసుకోవచ్చు. నాకు అభ్యంతరం లేదు..."

"పూజలు, వ్రతాలు చేసేది ఆడవాళ్ళే కదా..."

"అలా అని రాజ్యాంగంలో రాసి ఉందా? నేను మాత్రం అలాంటివి చెయ్యను. ఇంకొక ముఖ్యమయిన విషయం... మంగళసూత్రాలు, మెట్టెలు లాంటివి పెట్టుకోను."

"దాంట్లో తప్పేం ఉంది?"

"మనం తప్పుఒప్పుల గురించి చర్చించుకోవటం లేదు రవీ! ఇష్టాఇష్టాల గురించి మాట్లాడుకుంటున్నాం. అవి పెట్టుకోవటం నాకు ఇష్టం లేదు. కాబట్టి నేను చెయ్యను. అంతే..."

నేను ఏమీ మాట్లాడలేదు. ఇప్పుడు అర్థమయింది ఇంత అందమయిన అమ్మాయి ఇంకా పెళ్ళి కాకుండా ఎందుకు ఉండిపోయిందో. నా వరకు సరే... ఎలాగోలా ఎడ్జస్ట్ అయినా, ఈ విప్లవాన్ని ఇంట్లో వాళ్లకు పరిచయం చేసేది ఎలా?

నేను ఆలోచనలలో ఉండగానే, "నువు నన్ను ఆశ్చర్యపరిచావు రవీ! ఒక గంట నాతో గడిపిన వారిలో యాభై శాతం మంది కూడా రెండో రోజు కలుసుకోవటానికి కూడా ఇష్టపడరు..." అంది ఆమె.

"నేను నీ మాటలను తప్పు, ఒప్పుల దృష్టి కోణంతో చూడటం లేదు. అందుకే అవి నచ్చాయా, లేదా అన్న ప్రసక్తి లేదు. నువు నచ్చినపుడు నీ అభిప్రాయాలు కూడా నచ్చాలిగా..." అన్నాను.

"నచ్చితే చాలదు రవీ! ఒకరి అభిప్రాయాలు ఒకరికి నచ్చితే మంచి స్నేహితులవుతారు. కానీ మంచి భార్యాభర్తలు కావాలంటే అంతకు మించి కావాలి. ఒకరి కోసం ఒకరు త్యాగాలు చేయక పోయినా పరవాలేదు. చిన్నచిన్న ఎడ్జస్ట్‌మెంట్లకు తయారయి ఉండాలి..."

ఇంతింత ఉపన్యాసాలు ఇస్తున్న మాధురి మరి తను ఎంతమాత్రం ఎడ్జస్ట్ అవటానికి తయారుగా ఉందో తెలుసుకోవాలని అనిపించింది. అందుకే, "సహకరించటం అన్నది ఇద్దరి వైపునుండి ఉండాలిగా మాధురీ..." అన్నాను.

"నూటికి నూరు శాతం ఇద్దరి వైపు నుండి ఉండాలి. కానీ తరతరాలుగా మన సమాజం ఆ విషయం గుర్తించటం లేదు. ఒక్క ఆడదానికే ఈ నియమాలు వర్తింప చేస్తోంది. ఆడపిల్లే అత్తారింటికి వెళ్లాలి. మొగుడికి కావలసినట్లు, అత్తమామలకు నచ్చినట్లు తనను తాను మార్చుకోవాలి. తనకంటూ స్వంత అభిప్రాయం ఉండకూడదు. ఉద్యోగం చేసే ఆడదయినా వంట తనే చెయ్యాలి. పిల్లలు పుడితే వాళ్ళ పెంపకం బాధ్యత ఆమే చూసుకోవాలి. ఆడవాళ్ళు ఇన్ని విషయాలలో సహకరించినందుకు గానూ, మగవాడు తన వంతుగా ఏం చేస్తున్నాడు? వంట చేస్తే తిని పెడుతున్నాడు. వీలయితే వంకలు పెడుతున్నాడు. ఎదుటివాళ్ల ఇష్టంతో సంబంధం లేకుండా పడకగదిలో సుఖపడుతున్నాడు..." ఆవేశంగా అంటూ అలుపు వచ్చినట్లు ఆగింది. "ఇప్పుడు చెప్పు ఎవరు ఎడ్జస్ట్ కావాలి?" అని ముక్తాయింపు కూడా ఇచ్చింది.

'ఈ అమ్మాయితో మాట్లాడటం చాలా కష్టం...' అనుకున్నాను. వాదించి గెలవటం ఇంకా కష్టం. ఈ అమ్మాయి చెప్పే వాటన్నిటికీ 'ఊ...' అంటే నా బ్రతుకు ఎలా తయారవబోతుందో సినిమాలో దృశ్యాల్లా కళ్ళ ముందు కనిపిస్తోంది. నేను చేసుకోవలసింది పెళ్లి తప్ప, ఆ వంకతో కట్టుబానిసత్వం కాదు అని అనిపించింది. ఇక ఈ సమావేశం ముగించి లేద్దాం అనుకుంటుంటే... మాధురి ఒక మాట అంది. "నీకు ఒక చెల్లెలు ఉందన్నావు కదా! ఆ అమ్మాయిని

మీరంతా అపురూపంగా, గారాబంగా పెంచుకుని ఉంటారుగా! రేపు ఆ అమ్మాయికి అంతగా సహకరించని మొగుడు దొరికాడనుకో అప్పుడు ఆ అమ్మాయి పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో నువ్వే ఆలోచించి చూడు.”

ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్లు అయింది నాకు. ఆమె అన్న ఒక్కమాటతో నా ఆలోచనల ధోరణి మారిపోయింది. నా చెల్లెలుకు ఎలాంటి జీవితం వద్దనుకుంటున్నానో, అలాంటి జీవితం నా భార్యకు ఎందుకు ఇవ్వాలి? నా ఆలోచనలలో ఉన్న డొల్లతనం అప్పుడు అర్ధమయింది. గొంతు సవరించుకుని, “మాధురీ! నువు చెప్పినట్లు నేను ఎడ్జస్ట్ అవుతాను. నిన్ను మారమని బలవంత పెట్టను. నీ స్వాతంత్రానికి అభ్యంతరం పెట్టను...” అన్నాను.

“గుడ్! నా దృష్టిలో పెళ్ళి అనేది ఒక కాంట్రాక్ట్. కేవలం ఒకరికే లాభం ఉంటే ఆ బంధం ఎంతో కాలం నిలవదు. ఇప్పటిదాకా నేను వేటికి ఎడ్జస్ట్ అవనో చెప్పాను. ఇప్పుడు మన పెళ్ళి జరిగితే నేను ఎలా ఉండాలనుకుంటున్నానో చెప్తాను. నీకు జీవితాంతం ఒక మంచి స్నేహితురాలుగా ఉంటాను. నీ కష్టంలో అండగా, నీ ఆనందంలో తోడుగా ఉంటాను. చనిపోయే క్షణం వరకు నా వలన నీకు నిరాశ కలగకుండా చూసుకుంటాను...” అంది మాధురి.

ఆ తరువాత మాట్లాడుకోవటానికి పెద్దగా మాటలు దొరకలేదు.

గుడిలో నుండి బయటకు వస్తుంటే, ‘అమ్మా, అయ్యా...’ అంటూ బిచ్చగాళ్ళ అరుపులు వినిపించాయి. జేబులో నుండి చిల్లర బయటకు తియ్యబోయాను. ‘ష్...’ అంటూ నా చెయ్యి పుచ్చుకుని ఇవతలకు తీసుకు వచ్చింది.

“అదేంటి! బిచ్చం వెయ్యటం కూడా తప్పేనా?” అడిగాను నేను ఆశ్చర్యంగా.

“దేశంలో ప్రతి సంవత్సరం ఎనిమిది లక్షల మంది పిల్లలు దొంగలింపబడుతున్నారు. ఎందుకో తెలుసా? బలవంతంగా యాచక వృత్తిలోకి దించటానికి. పైగా సానుభూతి కోసం లక్షణంగా ఉన్న పిల్లలను వికలాంగులుగా చేస్తున్నారు. కళ్లు, కాళ్లు, చేతులు, తొలగిస్తున్నారు. ఇది కూడా ఒక మాఫియా. ఇది ఆగాలంటే నువు చేయగలిగింది ఒకటే... ధర్మం చేయటం మానుకో. కావాలంటే ఒక పండో, ఫలమో ఇవ్వు. ఎట్టి పరిస్థితుల్లో డబ్బులు మాత్రం ఇవ్వకు...”

నోరు తెరచుకుని మాధురి చెప్పే మాటలు విన్నాను. నాకు ఒకటి అర్ధమయింది. ఈమెతో సాహచర్యం చేస్తే, నేను ఆనందంగా ఉంటానో, లేదో తెలియదు. కానీ... నా జీవితం మాత్రం రొటీన్‌గా ఉండదు.

మా ఇద్దరి మధ్య మూడో సమావేశాన్ని మా ఇంట్లో ఏర్పాటు చేశాను. మాధురిని ఇంటికి తీసుకు వెళ్లే ముందు మా తల్లితండ్రులను ప్రిపేర్ చెయ్యటానికి వారం రోజులు పట్టింది. మాధురి అభిప్రాయాలు తెలుసుకుని, నన్ను వెనక్కి లాగాలని ప్రయత్నించి, కుదరక, ‘నీ ఖర్మ...’ అని వాళ్ళు ఊరుకుండి పోయారు. మా చెల్లెలికి మాత్రం మాధురి మీద అప్పటికే హీరోయిన్ వర్షిప్ ఏర్పడింది.

మాధురి మా ఇంటికి వచ్చింది. ఏం మాట్లాడితే ఏం ప్రమాదమో అన్నట్లు భయపడుతూ కూర్చున్నారు మా అమ్మ, నాన్న.

"నమస్కారం అంకుల్, నమస్కారం ఆంటీ..." అని తనే వారిని పలుకరించింది.

మొహమాటంగా నవ్వారు వారిద్దరు.

"మేమిద్దరం భార్యాభర్తల్లా కాకుండా మంచి స్నేహితుల్లా ఉండాలని నిర్ణయించుకున్నాం ఆంటీ..." చెప్పింది మాధురి.

"మరి నీతో మేము ఎలా ఉండాలి?" వద్దనుకున్నా కోపం ధ్వనిస్తున్న గొంతుతో అడిగింది మా అమ్మ.

"మీరు మీ అమ్మాయితో ఎలా ఉంటున్నారో నాతో అలా ఉండండి. నేను నా తల్లితండ్రులతో ఎలా ఉంటానో మీతో అలా ఉంటాను..." సింపుల్‌గా చెప్పింది మాధురి.

ఈ అమ్మాయి మాటలతో ఎవరినయినా బోల్తా కొట్టించగలదు అనుకున్నాను.

గొంతు సవరించుకున్న మాధురి, "అదే సమయంలో రవి మా అమ్మానాన్నలతో ఎలా ఉంటాడన్న విషయం మీద కూడా మన సంబంధాలు ఆధారపడి ఉంటాయి..." అని చెప్పింది.

మా చెల్లెలు ఇప్పుడు మాధురి మొహంలోకి ఆరాధనగా చూస్తూ ఆమె పక్కన కూర్చుని ఉంది.

అనుకున్నదాని కంటే సామరస్యంగా ఆ సమావేశం ముగిసింది.

మరొక రోజు మాధురి నన్ను వాళ్ల ఇంటికి తీసుకు వెళ్లింది. అక్కడ చెప్పుకోదగ్గ వింతలేమీ జరగలేదు. కూతురికే నచ్చాక వాళ్లకు నాలో అభ్యంతరం పెట్టటానికి కారణం ఏమీ కనపడలేదు.

ఏదీ పద్ధతి ప్రకారం జరగక పోయినా అంతా సంతృప్తిగా ఉంది.

దాదాపు రెండు నెలలు గడిచిపోయాయి. ఇప్పుడు మా మధ్య దూరం మరింత తగ్గింది. మా భావాల మధ్య సారూప్యం పెరిగింది.

ఒక రోజు తెగించి మా ఆఫీసు క్యాంటీన్‌లో కూర్చుని కాఫీ తాగుతూ, "ఇంకా ఆలస్యం ఎందుకు? మనం పెళ్లి చేసుకుందాం..." అన్నాను.

"నేను రెడీ..." అంది తను.

అంత త్వరగా తను ఒప్పుకుందంటే నాకు నమ్మబుద్ధి కాలేదు. ఆనందంగా ఆమె చేతి మీద చెయ్యి వేద్దామనుకున్నాను. టేబుల్ మీద ఉన్న ఫోర్క్ భయపెట్టింది.

తనే నా చేతి మీద చెయ్యి వేసి, "వెళ్దాం పద..." అంది.

"ఎక్కడికి?"

"రిజిస్ట్రార్ ఆఫీసుకు. ఇప్పుడు రిజిస్టర్ చేసుకుంటే నెల తరువాత మ్యారేజ్ అవుతుంది."

"రిజిస్ట్రార్ ఆఫీసులోనా? ఇంట్లో వాళ్ళు ఒప్పుకోరేమో..." అన్నాను.

"వాళ్లని నేను కన్విన్స్ చేస్తానుగా..." అంది తను.

"పోనీ పెళ్లయ్యాక రిసెప్షన్ పెట్టుకుందాము..." అన్నారు మా అమ్మా, నాన్నా.

"బడ్జెట్ ఎంత అంకుల్..." అడిగింది మాధురి.

"ఎందుకమ్మా?" సౌమ్యంగా అడిగాడు మా నాన్న.

"అందులో సగం ఏదన్నా ఛారిటీకి ఇవ్వండి అంకుల్. పుణ్యం వస్తుంది."

"అదేంటమ్మా! మీ పెళ్ళి సంగతి బంధువులకీ, స్నేహితులకీ తెలియవద్దా?" అంది మా అమ్మ.

ఈ విషయంలో మాత్రం మాధురితో ఏకీభవించనట్లు దూరంగా జరిగింది మా చెల్లెలు.

"అయ్యో! తెలియకుండా ఎలా ఆంటీ... అందుకేగా మ్యారేజ్ సర్టిఫికెట్ తీసుకుంటున్నాం. దానిని వాట్సప్‌లో అందరికీ పంపిద్దాం." అంది మాధురి.

మాధురి కోరుకున్న విధంగానే మా పెళ్ళి జరిగింది.

ఆ రాత్రి ఎవరింటికి వారు కాకుండా మా ఇంటికి వెళ్లాం. ఏ మాటకామాట చెప్పుకోవాలి. సరసం విషయంలో తను ఏ కండిషన్లూ పెట్టలేదు. ఇద్దరం కింద, మీద పడుతుంటే నా చెయ్యి ఆమె తల మీద పడింది. అక్కడ ఏవో గట్టిగా రెండు తగిలాయి. తడిమి చూస్తే అవి కొమ్ములు.

"ఇవేమిటి?" అడిగాను ఉలిక్కిపడి లేచి కూర్చుంటూ.

"కొమ్ములు..." అంది తను అదేదో మామూలు విషయంలా.

"అవి ఉన్నాయని ముందే ఎందుకు చెప్పలేదు?" అన్నాను కోపంగా.

"అదేంటి నాకు రెండు కళ్లు, రెండు కాళ్లూ ఉన్నాయని చెప్పానా? రెండు కొమ్ములు ఉన్నాయని చెప్పటానికి?"

"అవి అందరికీ ఉంటాయి. కొమ్ములు ఎవరికీ ఉండవు."

"అందుకే నేను స్పెషల్. అయినా ఆ విషయం నీకు తప్ప అందరికీ తెలుసు. నీకు కూడా తెలుసేమో అనుకుని చెప్పలేదు..." అంది తను.

ఇప్పుడు గుర్తుకు వస్తోంది. మాధురి గురించి చెప్పినపుడు మా అమ్మా, నాన్నల మొదటి రియాక్షన్ అదే. "అదేం ఆడపిల్లరా! తనకేమన్నా నెత్తిన కొమ్ములు ఉన్నాయా ఏమిటి?" అన్నారు ఉమ్మడిగా.

ఆఫీసులో సహోద్యోగులు కూడా, 'మాధురికి నెత్తి మీద కొమ్ములు ఉంటాయి...' అనే వాళ్లు. వాళ్లేదో మాట వరసకు అంటున్నారనుకున్నాను. అదే నిజమని అనుకోలేదు.

"అవి పోయే మార్గం లేదా?" అన్నాను.

"ఎందుకు పోవాలి?" ఎదురు ప్రశ్నించింది మాధురి.

"అదేంటి? నెత్తిన కొమ్ములు ఉండటం అంటే ఎంత నామర్దా?"

"అదేం కాదు. మొగపిల్లల సంగతి నాకు తెలియదు కానీ, ఆడపిల్లలకు నెత్తిన కొమ్ములు ఉండటం అదనపు క్వాలిఫికేషన్..." అంది తను.

ఎవరో చెప్తే తెలిసే కంటే నేనే చెప్తే నయం కదా అని, మరుసటి రోజు, "నా పెళ్లానికి కొమ్ములు వచ్చాయి..." అని అందరికీ చెప్పాను.

ఆ సంగతి మాకు ఎప్పుడో తెలుసు అన్నట్లు వారందరు పగలబడి నవ్వారు.

COMMENTS